క్లుప్తంగా

ప్రశాంతంగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ రేణుక

అగళి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ రేణుక అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా జరిగింది. ఎంపీడీఓ రవిప్రసాద్ మాట్లాడుతూ మరుగుదొడ్లు నిర్మించుకోవాలనుకునే వారు ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వివిధ సంక్షేమం, అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు.

గోమాతలకు సీమంతం



గోమాతలకు సీమంతం నిర్వహిస్తున్న మహిళలు

పావగడ: స్థానిక కణివె లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఆవరణలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గోమాతలకు సీమంతం వేడుకను సోమవారం వైభవంగా నిర్వహించారు. గోమాతల కొమ్ములకు గాజులు తొడిగారు. ముఖాలకు పసుపు కుంకుమ రాసి, పూలు అలంకరించి సీమంతం నిర్వహించారు. మహిళలు సీమంతం పాటలు పాడారు.

క్రీడా పరికరాల పంపిణీ



క్రీడా పరికరాలు అందిస్తున్న దృశ్యం

అగళి: 'ఆడుదాం ఆంధ్ర' పోటీల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు క్రీడా పరికారాల కిట్లను సరఫరా చేసింది. ఎంఈఓ–2 చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని 45 పాఠశాలలకు క్రీడా పరికారాల కిట్లు పంపిణీ చేశారు.

పూడ్చిన శవానికి పోస్టుమార్టం

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని కొటిపి గ్రామంలో ఈ నెల 14న నాగరాజు అనేవ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. తరువాత అతన్ని వారి పొలంలోనే పూడ్చారు. అయితే కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సోమవారం తహసీల్దార్ స్వర్ణలత, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ అబ్దుల్‌కలాం ఆజాద్ సమక్షంలో నాగరాజు మృతదేహాన్ని బయటకు తీసి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.

కాడు గొల్లలను ఎస్టీలో చేర్చండి



ర్యాలీ నిర్వహిస్తున్న కాడు గొల్లలు

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఉన్న బుడకట్టు సంస్కృతికి చెందిన కాడు(అడవి) గొల్లలను ఎస్టీలో చేర్చాలని డిమాండ్ చేస్తూ స్థానిక కాడు గొల్లల సంఘం నాయకులు సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో కాడు గొల్లలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాలూకా కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. మాజీ జెడ్పీ సభ్యుడు, కర్ణాటక రాజ్య కాడు గొల్లల సంఘం కార్యాధ్యక్షుడు పాపణ్ణ మాట్లాడుతూ కాడు గొల్లలు కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 8 లక్షల మంది ఉన్నారన్నారు. అన్ని విధాలా వెనుకబడిన కాడు గొల్లలను ఎస్టీలో చేర్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.గౌరవ అధ్యక్షుడు సణ్ణయ్య, సంఘం అధ్యక్షుడు ఎస్ బోరప్ప, నాగప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సంఘాలను బలోపేతం చేసుకోవాలి

అమరాపురం: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సోమవారం మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. శ్రీ నిధి, బ్యాంకు రుణాలు, సంఘాల ఆర్థిక ప్రగతి తదితర వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా ఏసీ నాగరాజు మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు రుణాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. ఏపీఎం తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు రైల్వే గేట్ మూసివేత

పెనుకొండ రూరల్: మండలంలోని గేట్ ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలోని రైల్వేగేట్‌ను మరమ్మతుల కారణంగా మంగళ, బుధ వారాల్లో మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. వాహనదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పొగరాయుళ్లకు నకిలీ సెగ !

అగ్గిపుల్ల... సబ్బుబిళ్ల... నూనె ప్యాకెట్... సిగరెట్ పెట్టె... ఇలా అన్నింటిని నకిలీ చేస్తున్నారు అక్రమార్కులు. ముఖ్యంగా నకిలీ సిగరెట్ ప్యాకెట్లను గుట్టుచప్పుడు కాకుండా ఉమ్మడి అనంతపురం జిల్లాలోని మార్కెట్లోకి దింపేస్తూ జేబులు నింపుకుంటున్నారు.

- ఉమ్మడి అనంత జిల్లాలో జోరుగా నకిలీ సిగరెట్ల విక్రయాలు
- బెంగళూరు కేంద్రంగా అమ్మకాలు
- కల్తీతో ఆరోగ్యానికి అత్యంత ముప్పంటున్న వైద్యులు



ఇటీవల కొడికొండ చెక్‌పోస్టులో పట్టుబడిన నకిలీ సిగరెట్లు (ఫైల్)

హిందూపురం అర్బన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో నకిలీ సిగరెట్లు హల్‌చల్ చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం అనుమతించిన ప్రధాన బ్రాండ్లను పోలిన సిగరేట్ల ప్యాకింగ్‌తో నకిలీ సిగరేట్లు మార్కెట్‌లోకి వస్తున్నాయి. బెంగళూరు కేంద్రంగా కొడికొండ చెక్‌పోస్టు, హిందూపురం, పెనుకొండ, పుట్టపర్తి, కదిరి, గోరంట్ల మడకశిర పట్టణాలతో పాటు అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాలకు నకిలీ సిగరేట్లు చేరుతున్నాయి. ప్రధాన బ్రాండ్లను పోలిన రీతిలో ఉండటంతో పల్లెల్లోనూ జోరుగా అమ్మకాలు జరుగుతున్నాయి.

విజిలెన్స్ అధికారుల దాడులతో వెలుగులోకి..

కొడికొండ చెక్‌పోస్టు వద్ద విజిలెన్స్ సీఐ రామారావు ఆధ్వర్యంలో అధికారులు చేసిన దాడుల్లో నకిలీ సిగరెట్ల గుట్టు రట్టైంది. ఓ అక్రమ రవాణాదారుని నుంచి రూ.3.75 లక్షల విలువ జేసే నకిలీ సిగరెట్ బండిల్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు కేంద్రంగా ఈ నకిలీ సిగరెట్ల దందా జరుగుతోందని అధికారులు గుర్తించారు. అసలు సూత్రధారుల కోసం విజిలెన్స్ అధికారులు గాలిస్తున్నట్లు తెలుస్తోంది.

పన్ను చెల్లించకుండానే..

చట్ట ప్రకారం సీఓటీపీఏ కింద కేంద్ర ప్రభుత్వం అనుమతించిన సిగరెట్ బ్రాండ్లను మాత్రమే మార్కెట్‌లో విక్రయించాలి. పొగాకు ఉత్పత్తులపై 28 శాతం కేంద్ర జీఎస్‌టీ ఉంటుంది. సిగరేట్లలో 80 శాతం ఐటీసీ కంపెనీవి కాగా.. అనుమతి ఉన్న బ్రాండ్లు మరికొన్ని ఉన్నాయి. అయితే అక్రమార్కులు ప్రధాన పట్టణాల్లో వ్యాపారులతో మాట్లాడుకొని నకిలీ సిగరెట్లు సరఫరా చేస్తున్నారు. గోల్డ్ ఫ్లాక్ కింగ్ ఫిల్టర్‌ను పోలిన గోల్డ్ స్టాగ్, హెర్బల్‌గోల్డ్, గోల్డ్ విమల్, మింట్‌ల పేరుతో ఎలాంటి పన్ను చెల్లించకుండా సిగరెట్ల అమ్మకాలు సాగిస్తున్నారు.

వ్యాపారులకు ఆశచూపి అమ్మకాలు..

సిగరేట్ ప్యాక్‌లపై ఎమ్మార్పీ రూ.50 ఉంటే రూ.20 నుంచి 30కే వ్యాపారులకు అక్రమదారులు ఇస్తున్నారు. అధిక లాభాలు వస్తుండటం, ట్యాక్స్ లేకపోవడంతో వ్యాపారులు సైతం నకిలీ సిగరెట్లను పొగరాయుళ్లకు కట్టబెడుతున్నారు.

నకిలీ పొగ.. ప్రాణాంతకం

సాధారణంగా బ్రాండెడ్ సిగరెట్లు తాగితేనే క్యాన్సర్, గుండెజబ్బులు, నరాల బలహీనతలు, ఊపిరితిత్తుల వ్యాధులు సంక్రమిస్తుంటాయి. అలాంటిది పూర్తిగా నాసిరకం పొగాకుతో తయారవుతున్న నకిలీ సిగరెట్లు తాగడం వలన.. ఈ వ్యాధులు వేగంగా శరీరాన్ని దెబ్బతీస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సిగరెట్స్ తయారైన ఆరు నెలల్లోపే వినియోగించాలి. ఆ తర్వాత అందులో ఫంగస్ చేరి .. మనిషి ఆయువుని తీసేస్తుందని, సిగరెట్లకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు.

ప్రత్యేక నిఘా ఉంచాం

కర్ణాటక సరిహద్దు పట్టణాలతో పాటు ఉమ్మడి జిల్లాలో నకిలీ సిగరెట్ల అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఉంచాం. ఎక్కడైనా వ్యాపారులు నకిలీ సిగరెట్లు అమ్మకాలు చేస్తున్నట్లు సమాచారం ఉంటే తెలియజేస్తే తప్పక చర్యలు తీసుకుంటాం.

– రామారావు, విజిలెన్స్ సీఐ

ఉత్సవ విగ్రహం తరలింపు



ఉత్సవ విగ్రహాన్ని తరలిస్తున్న దృశ్యం

రొళ్ల: మండల పరిధిలోని కె.బ్యాడిగెరలో మంగళవారం కొల్హాపురి మహాలక్ష్మీదేవి అమ్మవారికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. సోమవారం సాయంత్రం రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాన్ని పూలతో అలంకరించి మేళతాళాలతో ఊరేగింపుగా కె.బ్యాడిగెర గ్రామానికి తీసుకువెళ్లి గ్రామం నడి బొడ్డున పట్టం కూర్చో బెట్టారు. మంగళవారం జరిగే ఉత్సవానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అనధికార కొళాయిలు తొలగించండి

హిందూపురం: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో అనాధికారికంగా వినియోగిస్తున్న కొళాయిలను గుర్తించి తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. సోమవారం సాయంత్రం సచివాలయ సిబ్బంది, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, సలహాలిచ్చారు.

రాజకీయ లబ్ధి కోసమే టీడీపీ ఎత్తులు

- మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం: పోచనపల్లి బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం అవుతున్నాయని తెలిసే రాజకీయ లబ్ధికోసం బ్రిడ్జి వద్ద టీడీపీ నాయకులు ఆందోళన చేస్తున్నట్లు డ్రామాలు చేశారని మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి విమర్శించారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షానికి తెగిపోయిన పోచనపల్లి బ్రిడ్జి వద్ద ప్రజల రాకపోకల కోసం తాత్కాలికంగా రూ.10 లక్షలతో ఐరన్ బ్రిడ్జి నిర్మించామన్నారు. ఫోర్‌వీలర్లు, ఆటోలు వెళ్లేందుకు వీలుగా బ్రిడ్జి కింద మార్గంలో మట్టి రోడ్డు కూడా వేశామన్నారు. బ్రిడ్జి కూలిపోయిన విషయం తెలీని ఓ కర్ణాటక వాసి కొద్దిరోజుల క్రితం ద్విచక్ర వాహనంపై నుంచి రాత్రి వేళ కిందపడి చనిపోవడం బాధాకరమన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.కోటితో పనులు చేపట్టామన్నారు. అనుమతుల కోసం కొద్దిగా జాప్యం జరిగితే దాన్ని సాకుగా చూపి లబ్ధిపొందాలని టీడీపీ నాయకులు రాజకీయం చేయడం సరికాదన్నారు. త్వరలోనే పనులు త్వరగా పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు శివ, ఆసీఫ్‌వుల్లా, నాగేంద్రబాబు, జె.మల్లికార్జున, రోషన్, షాజియా, నాగేంద్రమ్మ, గిరి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



పరిగి జెడ్పీ స్కూల్‌లో విద్యార్థులకు బహుమతులు అందించిన దృశ్యం

సాక్షిబృందం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లోని గ్రంథాలయాల్లో ముగింపు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు గ్రంథాలయాల ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు బహుమతులను అందించారు.

బలిజలు అన్ని రంగాల్లో రాణించాలి



బలిజ సంఘం వనభోజన కార్యక్రమంలో జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

హిందూపురం: అందరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఏపీ ఆగ్రోచైర్మన్ నవీన్‌నిశ్చల్ అన్నారు. కార్తీక మాసం సోమవారం సందర్భంగా బలిజ కులస్తుల ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కార్తీక వనభోజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆగ్రోచైర్మన్ నవీన్ నిశ్చల్‌తో పాటు అనంతపురం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ వాసంతీ సాహిత్య తదితరులు హాజరయ్యారు. నవీన్ నిశ్చల్ మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో బలిజలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. బలిజల అభ్యున్నతికి తమవంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జేఎల్ మురళీ, ఆకుల ఉమేష్, రాయల్‌గోపాల్, విజయ్‌గోపాల్, వెంకటరమణ, కై వరం తాతయ్య సంఘ ట్రస్టు అధ్యక్షులు రవి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా 'వై ఏపీ నీడ్స్ జగన్'

- సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- పండుగ వాతావరణంలో జరుగుతున్న కార్యక్రమం



గోరంట్ల: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



లేపాక్షి: డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



పెనుకొండ: సంక్షేమ లబ్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫారూఖ్

పరిగి: మండలంలోని పైడేటిలో సోమవారం 'వై ఏపీ నీడ్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పైడేటి, శీగిపల్లి గ్రామాల పంచాయతీ సర్పంచ్‌లు గంగాదేవి, లక్ష్మణ్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ సవిత, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరామప్ప తదితరులు మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఏర్పాటు చేసి సీఎం జగన్ అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, ఎంపీటీసీలు మారుతీరెడ్డి, చిక్కన్న, మాజీ కన్వీనర్ జయరాం, జేసీఎస్ మండల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సంక్షేమాభివృద్ధి సాధ్యమని నగర పంచాయతీ చైర్మన్ ఉమర్ ఫారూఖ్ పేర్కొన్నారు. సోమవారం నగర పంచాయతీ పరిధిలోని 4వ వార్డు సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. నాలుగవ సచివాలయం పరిధిలో ఇప్పటి దాకా దాదాపుగా రూ.26 కోట్లు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందాయన్నారు. వైస్ చైర్మన్ సునీల్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ నరసింహులు, కౌన్సిలర్లు తయూబ్, సద్దాం, నాయకులు కొండలరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

దుద్దేబండలో...

మండలంలోని దుద్దేబండలో సోమవారం వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గీత మాట్లాడుతూ సీఎం జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. జెడ్పీటీసీ శ్రీరాములు, సర్పంచ్ గౌతమి, నాయకులు రామ్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మల్లికార్జున, రాజారెడ్డి, శ్రీనివాసులు, సచివాలయాల కన్వీనర్ శ్యామునాయక్, మండల కన్వీనర్ నాగలూరు బాబు తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో వైఎస్సార్‌సీపీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వ పథకాలకు సంబంధించి కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, సర్పంచ్ గంగాదేవి, ఈఓఆర్డీ నాగరాజురావు, సచివాలయ కన్వీనర్ ఇమామ్ వలీ, నాయకులు ఆదినారాయణరెడ్డి, నరసింహులు, మూర్తి, బాబు, రామాంజి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: మండల కేంద్రంలోని సచివాలయం–3లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచు రూప చేతుల మీదుగా సంక్షేమ పథకాల లబ్ధిదారుల బోర్డును ఆవిష్కరించారు. జేసీఎస్ కన్వీనర్ ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ నాయకుడు రాజ్‌గోపాల్‌రెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతీరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంక్షేమ పాలనకు మరోసారి ప్రజలు పట్టం కట్టాలని ఎంపీపీ కవిత, మండల కన్వీనర్ రామిరెడ్డి, వైస్ ఎంపీపీలు శ్రీరామరెడ్డి, మూర్తి తెలిపారు. సోమవారం బుళ్లసముద్రం గ్రామ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సంక్షేమ పథకాల లబ్ధి పొందిన బోర్డును ప్రదర్శించారు. సర్పంచ్ రంగమ్మ, ఉప సర్పంచ్ రంగస్వామి, మండల జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్, తాలుకా బూత్ మేనేజర్ సత్యనారాయణ, మండల బూత్ మేనేజర్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షి–3లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి ఆధ్వర్యంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదినారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ అంజినరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఆదినారాయణ, నాయకులు శ్యాంప్రసాద్‌రెడ్డి, చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని ఎంపీపీ ప్రమీల పేర్కొన్నారు. సోమవారం గోరంట్ల మేజర్ పంచాయతీలోని మూడో సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గోరంట్ల మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు నూర్‌మహమ్మద్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు బాషా, పట్టణ కన్వీనర్ ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు

- ఎమ్మెల్యే తిప్పేస్వామి



రొళ్ల మండలం బీజీ హళ్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

రొళ్ల: రాజకీయ స్వలాభం కోసం టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పే మాయ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని బొమ్మగొండనహళ్లి సచివాలయం ఆవరణలో ఈఓఆర్డీ క్రిష్ణప్ప అధ్యక్షతన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక జెడ్పీటీసీ అనంతరాజుతో కలిసి ఎమ్మెల్యే తిప్పేస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వైఎస్సార్‌సీపీ నాలుగున్నరేళ్ల పాలనలో 99 శాతం నెరవేర్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏదో ఒక రూపంలో ప్రతి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. 2014 ఎన్నికల్లో బూటకపు హామీలు ఇచ్చి చంద్రబాబు ప్రజలను మోసగించారని గుర్తు చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌ను ఎదుర్కొనే దమ్ములేక ఒంటరిగా పోటీ చేయకుండా జనసేన పార్టీతో కుమ్మక్కై ఎన్నికలకు వెళుతుండటం సిగ్గుచేటని విమర్శించారు. చంద్రబాబు లబ్ధి పొందడం కోసం ఎంత నీచానికైన దిగజారుతాడని విమర్శించారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ను నమ్మేస్థితిలో లేరని గుర్తు చేశారు. అనంతరం నాయకులు, పార్టీ నాయకులతో కలసి పార్టీ జెండాను ఆవిష్కరించారు.

విశ్రాంత సైనికుడు శ్రీరామప్ప పరామర్శ

రొళ్ల మండలం బీజీ హళ్లిలో చేపట్టిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే తిప్పేస్వామి అదే గ్రామంలో అనారోగ్యంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మాజీ సైనికుడు శ్రీరామప్పను పరామర్శించారు. అనంతరం మల్లసముద్రం– బీజీ హళ్లికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఇరుగ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఉపాధి పథకం ద్వారా రోడ్డు నిర్మాణం చేపట్టే విధంగా ఈఓఆర్డీ క్రిష్ణప్పతో మాట్లాడారు. సర్పంచులు సదాశివప్ప, నరసింహప్ప, శారదమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, సచివాలయం కన్వీనర్ ముదుపేగౌడు, వైస్ ఎంపీపీ రత్నమ్మ, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, వైస్ సర్పంచ్ సీఎం ఘట్ట రవి, తదితరులు పాల్గొన్నారు.



లేపాక్షి: అలంకరణలో వీరభద్రస్వామి



హిందూపురం: శివాలయం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



హిందూపురం: భవనీశంకరాలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



మడకశిర: అలంకరణలో చంద్రమౌళేశ్వరుడు

కార్తీక శోభ

సాక్షిబృందం: కార్తీకమాసంలో వచ్చిన తొలి సోమవారం సందర్భంగా శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని శివాలయాలకు ఉదయమే చేరుకున్న భక్తులు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో స్వామివార్లు ప్రత్యేక అలంకరణల్లో దర్శనమిచ్చారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

మడకశిర: బాలల హక్కులను పరిరక్షించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ నాగమల్లేశ్వరి కోరారు. సోమవారం పట్టణంలోని గుడిబండ మహాత్మ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో ఆర్డీటీ, ఐసీడీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో బాలల హక్కుల ముగింపు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆర్డీటీ సెక్టార్ టీం లీడర్ ఆదినారాయణ, ఎంఈఓ భాస్కర్, ఎస్ఐ లోకేశ్, ప్రిన్సిపాల్ హెప్సిబా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, తదితరులు పాల్గొన్నారు.